## క్లుప్తంగా

### 140 మందికి వైద్య సేవలు



వైద్య సేవలు అందజేస్తున్న వైద్యుడు సదాశివ

పాతపట్నం: మండలంలోని హరిజన గోపాలపురంలో పాతపట్నం గ్రామానికి చెందిన ఆర్.షణ్ముఖరావు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విశ్రాంత వైద్యుడు గణపతి సదాశివ 140 మందికి వైద్య సేవలు అందించారు. అవసరమైన రోగులకు మందులు అందజేశారు. వైద్యుడు సదాశివ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వేడి నీరు తాగాలన్నారు. విశ్రాంత ఎస్ఐ కె.శివాజీ రెడ్డి, ఎస్.మురళి, ఎం.రామారావు, సంతు, తదితరులు పాల్గొన్నారు.

### బాధ్యతల స్వీకరణ



కల్యాణ్ బాబు

నరసన్నపేట: స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి జనరల్ మెడిసిన్ స్పెషలిస్టు వైద్యుడిగా రాజాం నుంచి బదిలీపై వచ్చిన కల్యాణ్ బాబు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. కల్యాణ్ బాబు జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారిగా (ఇన్‌చార్జి) బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నరసన్నపేటలో స్త్రీ వైద్య నిపుణులుగా గత ఐదేళ్లుగా పనిచేసిన జయశ్రీ రిలీవ్ అయ్యారు. ఈమెకు పార్వతీపురం బదిలీ అయింది.

### ఔదార్యం..



సిమెంట్ బస్తాలకు అవసరమైన నగదును అందజేస్తున్న భగత్‌సింగ్ ట్రస్టు సభ్యులు

కొత్తూరు: కొత్తూరుకు చెందిన భగత్‌సింగ్ చారటబుల్ ట్రస్టు సభ్యులు ఔదార్యం చాటుకున్నారు. కొత్తూరు పంచాయతీ పరిధి కొత్తపేట కాలనీలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో కోగాన పద్మకు చెందిన పూరిల్లు పూర్తిగా కాలి బూడిదైంది. ఇంటి నిర్మాణం కోసం ట్రస్టు తరపున 100 సిమెంట్ బస్తాలకు సంబంధించి నగదను ట్రస్టు సభ్యులు ఆదివారం అందజేశారు. ఈ ప్రమాదంలో నగదుతోపాటు నలుగురు కుమార్తెలకు చెందిన సర్టిఫికెట్లు, విలువైన వస్తువులు, నిత్యావసర సరుకులు కాలిపోయాయి. నిరుపేదరాలైన పద్మకు తమవంతు సాయం అందజేసినట్లు ట్రస్టు సభ్యులు తెలిపారు.

### ముమ్మర తనిఖీలు



ట్రావెల్స్ బస్సులో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

పాతపట్నం: ఆంధ్రా–ఒడిశా సరిహద్దులోని పాతపట్నం చెక్‌పోస్టు వద్ద పాతపట్నం సీఐ వి.రామారావు ఆధ్వర్యంలో ఆదివారం వాహనాలు తనిఖీ చేపట్టారు. వాహనదారులు చాలా మంది నిబంధనలు పాటించడం లేదన్నారు. సరిహద్దు ప్రాంతంలో ఒడిశా నుంచి వచ్చే ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశామన్నారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల్లో కూడా ప్రతీ రోజు తనిఖీలు చేపడుతున్నామన్నారు. గంజాయి, మద్యం, నిషేధిత మత్తు పదార్థాలను అరికట్టడానికి నిఘా పెంచామన్నారు. వాహన తనిఖీల్లో ఏఎస్ఐలు సింహాచలం, రామారావు, పోలీసులు పాల్గొన్నారు.

### పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అప్పలనాయుడు, సాహితీవేత్తలు

పాతపట్నం: ప్రతి ఒక్కరికీ సామాజిక స్పృహ ఉండాలని ప్రముఖ సాహితీవేత్త, రచయిత అట్టాడ అప్పలనాయుడు అన్నారు. పాతపట్నం శాఖా గ్రంథాలయంలో సాహితీ వేదిక, సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ఉపాధ్యాయుడు కొల్లి లక్ష్మీనారాయణ రచియించిన టీటీ పిట్ట పుస్తకాన్ని అప్పలనాయుడు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ మానవ జీవితంలో మనం ఏం కోల్పోతున్నామో ఈ పుస్తకంలో రచయిత తెలియజేశారన్నారు. సామాజిక ధర్మాన్ని కవి సూక్ష్మ దర్శనం చేయాలన్నారు. అంతర్జాతీయ అంశాలతోపాటు స్థానిక అంశాలను ఈ పుస్తకంలో పొందుపరిచారన్నారు. ఈ కార్యక్రమంలో పాతపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశ్రాంత అధ్యాపకుడు తూలుగు తిరుపతిరావు, సాహితీవేత్త చీకటి దివాకర్, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కొండాల చక్రపతి, కాళ్ల రాజు, మహేంద్ర కళాశాల డైరెక్టర్ శాసనపురి మధుబాబు, బందన శ్రీనివాసరావు, విక్టరీ శంకర్, పూతి చంద్రభూషణం, సి.హెచ్.తిరుమలరావు, ఎం.సింహాచలాచార్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అందని పెట్టుబడి సాయం!



వరి వెదజల్లిన పొలం

- అన్నదాత సుఖీభవ పేరుతో రైతన్నలకు మోసం
- పెట్టుబడి సాయంగా ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని ప్రకటన
- ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా ఇవ్వని సాయం
- ఇస్తామని నమ్మిస్తున్న కూటమి నాయకులు
- గతేడాది ఖరీఫ్ సాగుకు అందని సాయం



నారుమడిని దుక్కి చేస్తున్న రైతు

ఎల్.ఎన్.పేట: పొలాన్ని నమ్ముకుని కష్టపడి పంటలు పండించే రైతుకు కూటమి ప్రభుత్వం ఏడాదిగా మోసం చేస్తూనే వస్తోంది. అధికారంలోకి వచ్చిన తరువాత 2024 జూన్ నుంచి ప్రతీ ఏడాది పంట పెట్టుబడి కోసం రూ.20 వేలు ఇస్తామని సీఎం చంద్రబాబుతోపాటు కూటమి నాయకులు రైతులను నమ్మించారు. ఎన్నికల సమయంలో అన్ని బహిరంగ సభల్లోనూ రైతులను ఆకాశానికి ఎత్తేశారు. సూపర్ సిక్స్ హామీలు అని ఇంటింటికీ వెళ్లి ప్రజలను నమ్మించారు. ఎన్నికల సమయంలో రైతుల ఓట్లతో అధికారం చేపట్టిన కూటమి నాయకులు హామీలు అమలు చేయడం మరిచి తమను మోసం చేశారని పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు. గతేడాది డబ్బులు రైతుల బ్యాంకు ఖాతాలకు జమకాలేదు. ఈ ఏడాది జూన్ నెల 20వ తేదీ అన్నారు. ఆ తేదీ కాస్త వాయిదా పడింది. ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి నెలకొంది.

| 2022–23 ఖరీఫ్ సీజన్‌కు రైతులకు చెల్లించిన రైతు భరోసా పెట్టుబడి సాయం ఇలా.. | | | | | |
|---|---|---|---|---|---|
| మండలం | హిరమండలం | కొత్తూరు | ఎల్.ఎన్.పేట | మెళియాపుట్టి | పాతపట్నం |
| రైతులు | 5,648 | 10,961 | 5,890 | 9,597 | 9,183 |
| జమైనది మొత్తం | రూ.13.75 కోట్లు | రూ.24.5 కోట్లు | రూ.13.5 కోట్లు | రూ.23.5 కోట్లు | రూ.22.5 కోట్లు |

#### జగనన్న పాలనలో..

2019 నుంచి 2023 వరకు అధికారంలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సకాలంలో రైతులకు పెట్టుబడి సాయం కింద రైతు భరోసా ఇచ్చారు. అప్పటి పాలనను రైతులు గుర్తు చేసుకుంటున్నారు.

#### సాగు సీజన్ పూర్తి..

గతేడాది ఖరీఫ్ సాగు సీజన్ ప్రారంభంలో రైతులు ప్రభుత్వం వైపు ఆశగా చూశారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20 వేల పెట్టుబడి సాయం అందుతుందని అనుకున్నారు. రోజులు, వారాలు, నెలలు.. చివరకు ఖరీఫ్ సాగు సీజన్ పూర్తయింది. రైతుల బ్యాంకు ఖాతాల్లో అన్నదాత సుఖీభవ నిధులు జమకాలేదు. పంట పెట్టుబడి కోసం తాహతకు మించి అప్పులు చేసి వడ్డీలు చెల్లించుకున్నామని రైతులు చెబుతున్నారు. చంద్రబాబుని నమ్ముకుంటే అప్పులపాలు కావాల్సిందేనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

#### ఈ ఏడాదైనా ఇస్తారో.. లేదో?



కూటమి ప్రభుత్వం ఇస్తామని చెప్పిన అన్నదాత సుఖీభవ పథకం గతేడాది ఖరీఫ్ సీజన్‌లో ఇవ్వలేదు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో అయినా ఇస్తారో.. లేదో? అనుమానంగానే ఉంది. ఖరీఫ్ సాగు సీజన్ ప్రారంభమై విత్తనాలు వేసుకుంటున్నాం. గతంలోనూ చంద్రబాబు అధికారంలోనికి రావాలని అనేక హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని అమలు చేయలేదు. ఇప్పుడు కూడా అదే పరిస్థితి.

– పల్లి అప్పలనాయుడు, రైతు, దబ్బపాడు, ఎల్.ఎన్.పేట

# యువత పోరుకు తరలిరండి



మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

- ఆమదాలవలస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్

ఆమదాలవలస: ఈ నెల 23వ తేదీన నిర్వహించనున్న యువతపోరు కార్యక్రమంలో పెద్ద ఎత్తున యువత పాల్గొని విజయవంతం చేయాలని ఆమదాలవలస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ పిలుపునిచ్చారు. ఆమదాలవలసలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ యువజన విభాగం నాయకులతో కలిసి ఆదివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిందని, అంతవరకు ఒక్కొక్కరికి నెలకు రూ.3000 నిరుద్యోగ భృతి ఇస్తామని నమ్మబలికిందన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత యువతకు నిరుద్యోగ భృతి ఇవ్వకుండా సీఎం చంద్రబాబు మోసం చేశారన్నారు. సోమవారం ఉదయం పది గంటలకు శ్రీకాకుళం కలెక్టరేట్ దరి జ్యోతిరావు పూలే విగ్రహం వద్దకు అన్నివర్గాల ప్రజలు చేరుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పొందూరు మండల నాయకుడు వండాన సూరపునాయుడు, పార్టీ జిల్లా ఇంటిలెక్చుల్ విభాగం అధ్యక్షుడు కొప్పల ఈశ్వరరావు, పార్టీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు బట్నా సత్యనారాయణ, సరుబుజ్జిలి మండల నాయకుడు అత్తులూరి రవికాంత్, పార్టీ నియోజకవర్గ డాక్టర్స్ విభాగం అధ్యక్షుడు దానేటి రామ్మోహన్, నాలుగు మండలాలు, మున్సిపాలిటీకి చెందిన నాయకులు, విద్యార్థి విభాగం నాయకులు, సరుబుజ్జిలి సర్పంచ్ బొడ్డేపల్లి హరి, దన్నాన అజయ్ కుమార్, మామిడి శ్రీనివాసరావు, కిరణ్‌కుమార్, హేమంత్ కుమార్, బస్వా అనంత్, దేవకోట ఈశ్వరరావు, బండి మహేష్, బలరాం, లోకేష్, ధనుంజయ్, తదితరులు పాల్గొన్నారు.

# యువత పోరును విజయవంతం చేయాలి



శిమ్మ సాంబశివరావు

ఎల్.ఎన్.పేట: వైఎస్సార్‌సీపీ అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం నిర్వహించే యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి, ఎల్.ఎన్.పేట మాజీ ఎంపీపీ శిమ్మ సాంబశివరావు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిందని, ఇంతవరకు యువతకు, నిరుద్యోగులకు, విద్యార్థులకు మేలు జరిగేలా ఒక్క సంక్షేమ పథకాన్నీ అమలు చేయలేదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా నిరుద్యోగులు కోసం అమలు చేయాల్సిన పథకాల ఊసే ఎత్తలేదన్నారు. నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేకుండా పోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ఏడాది పాలనలో యువత, విద్యార్థులు, నిరుద్యోగులకు వెన్నుపోటు పొడిచిందన్నారు. ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న యువతపోరు కార్యక్రమంలో అన్ని వర్గాలవారు పాల్గొనాలని కోరారు.

# క్రికెట్ టోర్నీ విజేత సత్యవరం



ట్రోఫీ అందజేస్తున్న ఎంపీపీ ఆరంగి మురళి, తదితరులు

నరసన్నపేట: మండలంలోని సత్యవరం గ్రామంలో గత పది రోజులుగా నిర్వహిస్తున్న ఎగళ్ల కృష్ణప్రసాద్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 40 జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. ఫైనల్‌కు పెద్దపాడు, వైకేపీ లెవెన్(సత్యవరం) జట్లు చేరాయి. ఫైనల్‌లో వైకేపీ లెవెన్ జట్టు బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో రాణించి ట్రోఫీ గెలుచుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన పెద్దపాడు నిర్ణీత 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 97 పరుగులు చేసింది. 98 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు చేసిన సత్యవరం వైకేపీ లెవెన్ జట్టు 9.2 ఓవర్లలో లక్ష్యాన్ని చేరుకొని ట్రోఫీని చేజిక్కించుకుంది. విన్నర్స్‌కు ట్రోఫీతోపాటు రూ.25 వేల నగదు, రన్నర్స్ జట్టు పెద్దపాడుకు ట్రోఫీతోపాటు రూ.12.500 నగదు బహుమతులు అందించారు. సత్యవరం జట్టుకు ట్రోఫీని ఎంపీపీ ఆరంగి మురళి, గ్రామస్తులు యగళ్ల చిన్ననర్సునాయుడు, నరసన్నపేటకు చెందిన వార్డు సభ్యులు ఇప్పిలి నీలం, సీర లక్ష్మీనారాయణ అందజేశారు. రెండేళ్ల క్రితం హైదరాబాద్ క్రికెట్ స్టేడియంలో స్నేహితులతో కలిసి క్రికెట్ ఆడుతూ కృష్ణప్రసాద్ మృతి చెందిన విషయం విదితమే.

### అభివృద్ధే ధ్యేయం



మాట్లాడుతున్న కూన రవికుమార్

ఆమదాలవలస: ఈ ఐదేళ్లలో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలంలోని కనుగులవలసలో సుమారు రూ.కోటి నిధులతో నిర్మించిన 18 సీసీ రహదారులను ఆదివారం ప్రారంభించారు. సీఎస్పీ రహదారి నుంచి ముద్దాడపేట వరకు రోడ్డు నిర్మాణానికి రూ.13 కోట్ల నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో ఏడాదిలోనే ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

### కొందరికే తల్లికి వందనం



చింతాడ సూర్యనారాయణ

కొత్తూరు: తల్లికి వందనం పథకాన్ని కొంత మందికే కూటమి ప్రభుత్వం అందజేసిందని కొత్తూరు పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ అన్నారు. కొత్తూరులో ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. ఒకటి, పదో తరగతి, ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం విద్యార్థులకు తల్లికి వందనం మంజూరు చేయలేదన్నారు. లక్షలాది మంది విద్యార్థులు ఈ పథకానికి నోచుకోలేదన్నారు. ఒక కుటుంబంలో ఎంత మంది విద్యార్థులున్నా తల్లికి వందనం మంజూరు చేస్తామని చెప్పిన సీఎం చంద్రబాబు.. నేడు సాంకేతిక కారణాలు చూపించి నిధులు మంజూరు చేయకపోవడం మోసం చేయడమేనన్నారు.

### వర్షా కాలంలో అప్రమత్తత అవసరం

హిరమండలం: భీకర గాలులు, ఉరుములు, మెరుపులతో వర్షం కురిసే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టెక్కలి డివిజన్ విద్యుత్ శాఖ డీఈఈ జి.శంకరరావు అన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వర్షం కురిసే సమయంలో పిడుగులు పడే అవకాశం ఉందని, చెట్ల కిందకు వెళ్లవద్దన్నారు. గాలులతో కూడిన వర్షం కురిసే సమయంలో ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు రావద్దని సూచించారు. రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారులు చాలామంది చెట్లు కిందకు వెళ్తుంటారని, అలా చేయడం చాలా ప్రమాదకరమన్నారు. చిన్నపాటి వర్షం కురవడం ప్రారంభం కావడం కాగానే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, ఇంట్లో ఉన్న కరెంట్ స్విచ్ బోర్డులు నుంచి ప్లెగ్‌లు తీసి వేయాలన్నారు.

### వైఎస్సార్‌సీపీ నాయకుడు మృతికి సంతాపం



ముఖలింగం (ఫైల్)

బూర్జ: మండలంలోని సింగన్నపాలెం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గేదెల ముఖలింగం ఆదివారం అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. చాలా కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. భార్య శ్రీలక్ష్మి, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈయన మృతి పట్ల నియోజకవర్గ, మండల, గ్రామ నాయకులు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తంచేశారు. సోమవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

# వైద్య శిబిరానికి విశేష స్పందన



పేర్లు నమోదు చేసుకుంటున్న రోగులు

ఆమదాలవలస: మున్సిపాలిటీలోని 21వ వార్డు పరిధి కుద్దిరాం గ్రామంలో మెట్టక్కివలస సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సత్యసాయి జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు ప్రారంభించారు. 120 మంది రోగులకు వైద్య సేవలు అందించినట్లు జిల్లా సేవాదళ్ సమన్వయకర్త పప్పల నాగేశ్వరరావు తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ సమన్వయకర్త బోయిన్ నరసింహమూర్తి సహకారంతో ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వైద్యులు పి.తాతయ్యలు, అనిత, బి.సాయికిరణ్, రుషికేశ్ వైద్యసేవలు అందించారు. గ్రామ సేవ మెసెంజర్ ఆకెళ్ల రామలక్ష్మి, సమితి కన్వీనర్ కన్నేపల్లి వెంకట కామావధానులు బాలవికాస్ కేంద్రాన్ని ప్రారంభించారు. సత్యసాయి సేవాసమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

### యువకునిపై కేసు నమోదు

హిరమండలం: మేజర్ పంచాయతీ హిరమండలం మండల పరిషత్ కార్యాలయం సమీపంలోని ఖాళీ ప్రదేశంలో కొంతమంది యువకులు ఆదివారం క్రికెట్ ఆడారు. ఒకే టీమ్‌కు చెందిన ఇద్దరి యువకుల మధ్య చిన్నతగాదా జరిగింది. తాను కూడా ఆడతానని వేణుగోపాల్ ముందుకు రావడంతో జి.శంకర్ కొట్టాడు.

వేణుగోపాల్‌కు తలపై గాయమైంది. హిరమండలం పోలీస్ స్టేషన్‌లో శంకర్‌పై వేణుగోపాల్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శంకర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎండీ ఆసిన్ తెలిపారు.

### ఫసల్ బీమాను సద్వినియోగం చేసుకోవాలి

ఆమదాలవలస: ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను రైతులు ఉపయోగించుకోవాలని ఏఓ మెట్ట మోహనరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోయిన సందర్భాల్లో ఈ పథకం రైతులకు ఆర్థిక రక్షణ కల్పిస్తుందన్నారు. తుఫాన్‌లు, అకాల వర్షాలు, కరువు వంటి అనూహ్య వాతావరణ పరిస్థితుల వల్ల పంటలకు నష్టం వాటిల్లినప్పుడు, వాస్తవ నష్టాన్ని అంచనా వేసి రైతులకు బీమా పరిహారం అందుతుందన్నారు. ప్రభుత్వం ఎంపిక చేసిన పంటలను సాగుచేస్తూ, నిర్ణీత గడువులోగా ప్రీమియం చెల్లించి నమోదు చేసుకున్న కౌలురైతులతో సహా రైతులందరూ ఈ పథకానికి అర్హులేనన్నారు.

#### ప్రీమియం వివరాలు ఇలా..

మొక్కజొన్న పంటకు రైతు ప్రీమియం 0.2%, అంటే ఎకరానికి రూ.66 మాత్రమే. వరి పంటల కోసం రైతు ప్రీమియం 0.4%, అంటే ఎకరానికి రూ.160 చెల్లించాల్సి ఉంటుందన్నారు. మొక్కజొన్న పంట బీమా కోసం జూలై 31 చివరి తేదీ. వరి పంటల బీమా కోసం ఆగస్టు 15వ తేదీ వరకు నమోదు చేసుకోవచ్చన్నారు. రైతులు తమ సమీప రైతు సేవా కేంద్రాలను సంప్రదించి మరింత సమాచారం పొందవచ్చని సూచించారు.

# కల్యాణం.. కమనీయం



కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

నరసన్నపేట: మండలంలోని గుండవల్లిపేటలోని లలితా చంద్రమౌళీశ్వర స్వామి కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. మహిళలు కుంకుమ పూజలు చేపట్టారు. గ్రామస్తుల సహకారంతో అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు. అర్చకులు వనమాళి రామకృష్ణ, సత్యసూర్యనారాయణ శర్మ, వనమాళి వరప్రసాద్‌తోపాటు పంచిరెడ్డి సింహాచలం, మురళి, సత్యం, పంచిరెడ్డి విశ్వనాథం, గ్రామస్తులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ప్రమాదకర మలుపు



కుద్దిగాం గ్రామ దేవత ఆలయం వద్ద ఉన్న ప్రమాదకర మలుపు

కొత్తూరు: మండలంలోని కుద్దిగాం గ్రామ దేవత ఆలయం వద్ద కురిగాం–రుగడ రోడ్డులో ఉన్న మలుపు ప్రమాదాలకు పిలుపుగా ఉంది. ఆల్ ఆంధ్రా రోడ్డు కావడంతో నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. మలుపు వద్ద ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించుకునే అవకాశం లేదు. మలుపు వద్ద హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

### నిరుపయోగం



ఈ చిత్రం సారవకోట మండలంలోని జగ్గయ్యపేట సమీపంలో నిరుపయోగంగా ఉన్న బస్సు షెల్టర్. సారవకోట మండలంలోని జాతీయ రహదారి 326–ఎ లో పలు చోట్ల నిర్మించిన బస్సు షెల్టర్లు నిరుపయోగాం ఉన్నాయి. వీటిని నిర్మించే సమయంలో ఎత్తుగా నిర్మించడంతో ఏ మాత్రం వర్షం పడిన బస్సు కోసం నిరీక్షించే ప్రయాణికులు తడిచిపోతున్నారు. ఎండ సమయంలో సైతం అక్కడ ఉండేందుకు అనుకూలంగా లేవు. వెంకటాపురం, వడ్డినవలస, సారవకోట, జగ్గయ్యపేట, సవరపేట, జగన్నాథపురం తదితర చోట్ల షెల్టర్లు రాత్రి సమయంలో మందు బాబుకు అడ్డాగా మారుతున్నాయని స్థానికులు తెలిపారు.

– సారవకోట

### అపారిశుద్ధ్యం..



ఈ చిత్రం సారవకోట మండలంలోని అవలింగి ప్రధాన వీధిలో పూడికలతో నిండిన మురుగునీటి కాలువ. గ్రామంలోని మురుగు నీటి కాలువలు పూడికలతో నిండిపోయాయి. దీంతో వ్యాధులను వ్యాపింపజేసే దోమలు, ఈగలు వృద్ధి చెందాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో వ్యాధులు వ్యాప్తిచెందే అవకాశం ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– సారవకోట

### అసంపూర్తిగా..



హిరమండలం మండలంలోని అంబావల్లి పంచాయతీ రెల్లివలసలో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. పదేళ్లకు పైగా అంగన్‌వాడీ భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. శ్లాబు వరకు నిర్మాణం చేపట్టి సంబంధిత కాంట్రాక్టర్ అసంపూర్తిగా వదిలేశారు. ఇదే విషయాన్ని అధికారులకు గ్రామస్తులు పలుసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రైవేట్ భవనాల్లో కొనసాగిస్తున్నారు. అటు చిన్నారులు, ఇటు సిబ్బంది అసౌకర్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి భవన నిర్మాణం పూర్తిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– హిరమండలం

### తాగునీటికి ఇబ్బందులు..



ఎల్.ఎన్.పేట మండలంలోని తురకపేటలో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసినప్పటికీ చుక్క నీరురావటం లేదని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. మెగా రక్షిత తాగునీటి పథకం నుంచి గ్రామ శివారుల్లో కుళాయిలు ఏర్పాటు చేశారు. వాటి నుంచి కూడా నీరు ఎప్పుడు వస్తుందో తెలియని దుస్థితి నెలకొంది. కుళాయిల వద్ద ఖాళీ బిందెలు ఉంచి రోజంతా ఎదురుచూసినా చుక్కనీరు రావటం లేదు. అధికారులు, పాలకులు స్పందించి తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– ఎల్.ఎన్.పేట